క్లుప్తంగా

ఉపాధి పనులపై సమీక్ష



ఘంటసాల: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో నిర్మించుకున్న గోకులం షెడ్ల బిల్లుల చెల్లింపు వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2025- 26 సంవత్సరానికి సంబంధించి గుర్తించిన పనులకు అంచనాలు తయారు చేయాలని, శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు, నిర్ధారించిన పనుల ద్వారా ఎక్కువ మందికి పని కల్పించాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి ఉపాధి హామీ పనుల్లో మండలాన్ని ముందంజలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీవోఏ పి.బాలు, టీఏ అలివేలు, సీవోఏ సువర్ణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

పెడన: పట్టణంలోని శ్రీవిఘ్నేశ్వరా ప్రార్థన మందిరంలో శుక్రవారం గుంటూరుకు చెందిన శంకర నేత్రాలయం, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఫెడరేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పిచ్చుక ఫణికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక సర్వోదయ వీవర్స్ సొసైటీలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. బాధితులు తమ వెంట ఆధార్, ఆరోగ్యశ్రీ, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలను, కుటుంబ సభ్యుని ఫోన్ నంబరు తెచ్చుకోవాలన్నారు. శుక్లాలు ఆపరేషన్‌కు ఎంపికైన వారికి డాక్టర్ సలహా మేరకు ఉచితంగా కంటి లోపల ఆద్దం అమర్చి ఆపరేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వైద్య శిబిరానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఫెడరేషన్ నాయకులు భళ్ల సాంబశివరావు, కట్టా హేమసుందరరావు, తాళ్ల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు ప్రారంభం



వెంకటాపురం(మోపిదేవి): వెంకటాపురం-పెదకళ్లేపల్లి జెడ్పీ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. అందులో భాగంగా బుధవారం పొక్లెయిన్ సాయంతో గుంతలు తొలిచి అందులో చిప్స్ వేసి గుంతలను పూడ్చించే పనులు చేపట్టారు. పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మహాశివరాత్రికి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు లక్షల్లో భక్తులు రానున్నారు. ఆలయానికి తరలివచ్చే భక్తుల వాహనాలను దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

వైభవంగా ప్రతిష్టామహోత్సవ పూజలు



చల్లపల్లి: మండల పరిధిలోని పాగోలు గ్రామంలోని శ్రీకైవల్యాశ్రమ చలాచలబోధోపదేశ మందిరంలో శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వర ప్రతిష్టా మహోత్సవాలు మూడవ రోజైన బుధవారం కూడా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివధ రకాల పూజలను విద్యాసాగర్ స్వామి పర్యవేక్షణలో వడ్లమూడి సుబ్రహ్మణ్య అవధాని, కేదారశర్మ అధ్వర్యంలో అర్చకులు వేద మంత్రాలు పఠించి పూజలు జరిపించారు. ఆశ్రమ ట్రస్టీ మేకా సత్యనారాయణప్రసాద్(బంగారుబాబు) దంపతులు, వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం కూడా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్ తెలిపారు.

మెడికల్ వ్యర్థాలు ఇలా.. భయపడొద్దంటే ఎలా?

- చల్లపల్లి ఆటోనగర్‌లో మెడికల్ వ్యర్థాలు
- బాధ్యత మరిచి బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వేస్తున్న వైనం
- భయపడుతున్న ప్రజలు



చల్లపల్లి- విజయవాడ ప్రధాన రహదారి పక్కన ఆటోనగర్ ముఖద్వారం వద్ద పడేసిన మెడికల్ వ్యర్థాలు

చల్లపల్లి: చల్లపల్లి- విజయవాడ ప్రధాన రహదారి పక్కన ఆటోనగర్ ముఖ ప్రవేశం వద్ద గుర్తు తెలియనివ్యక్తులు మెడికల్ వ్యర్థాలను పడేస్తున్నారు. వాడిన సిరంజిలు, సూదులు, ఇంజక్షన్ బాటిల్స్‌వంటి వాటిని ఇక్కడకు తీసుకువచ్చి పడేస్తుండటంతోస్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేయాల్సింది ఇలా..

బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం- 2016, పర్యావరణ పరిరక్షణ చట్టం- 1986 ప్రకారం ఆస్పత్రులు, క్లినిక్‌లు, ప్రయోగశాలలు, పశువైద్య సంస్థలు, బయోమెడికల్ శుద్ధి కర్మాగారాలతో సహా వ్యర్థాలను పసుపు, ఎరుపు, తెలుపు, నీలం వంటి నాలుగు రంగుల కోడెడ్ డబ్బాలలో వేసి బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు అప్పగించాలి. వాటిని వారు జనావాసాలకు దూరంగా తీసుకువెళ్లి ప్రత్యేకంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో నిబంధనలను అనుసరించి నిర్వీర్యం చేస్తారు. ఆ సంస్థకు ప్రతి నెలా కొంత మొత్తం చెల్లించాలి.

అంత రిస్క్ ఎందుకని..

అయితే కొందరు అంత రిస్క్ ఎందుకనుకుంటున్నారు. కక్కుర్తి పడి మెడికల్ వ్యర్థాలను వారికి అప్పగించకుండా గుట్టుచప్పుడు కాకుండా జన సంచార ప్రదేశాల్లో పడేసి ప్రజల, జంతువుల ఆరోగ్యానికి, పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు.

భయమెందుకంటే..

పడేసిన సూదులు గుచ్చుకుంటే వాటి ద్వారా హెచ్ఐవీ, హెపటైటిస్- బి, పచ్చకామెర్లు వంటి ప్రమాదకర జబ్బుల బారిన పడి ప్రాణాపాయం కావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జంతువులకు ఇవి గుచ్చుకున్నా అవి అనారోగ్యం పాలవటమే కాకుండా వాటి ద్వారా ప్రజలకు సోకే ప్రమాదం లేకపోలేదంటున్నారు.ఇంజెక్షన్ గాజు సీసాలు పగిలిగా యాలవటం, వాటిలో మందు విషపూరితమై ప్రాణాపాయం కల్గించవచ్చని హెచ్చరిస్తున్నా రు. పారిశుధ్య కార్మికులకు వాటిని శుభ్రపరిచే క్రమంలోప్రమాదం ఉండవచ్చని హెచ్చరిస్తున్నారు.

స్పందించాలని వినతి..

అధికారులు స్పందించి చల్లపల్లి ఆటోనగర్ ప్రాంతంలో పడేసిన మెడికల్ వ్యర్థాల ప్రాంతాన్ని శుభ్రపరచాలని ప్రజలు కోరుతున్నారు. వాటిని ఎవరు తీసుకువచ్చి ఇక్కడ వేస్తున్నారో గుర్తించి, వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మాజీ మంత్రి జోగి రమేష్ విస్తృత పర్యటన



మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బళ్ల గంగయ్య ఇంటి వద్ద నేతలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగి రమేష్

పెడన: పెడన నియోజకవర్గంలో మాజీ మంత్రి, పెడన మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్ బుధవారం పర్యటించారు. రమేష్ రాకను పురస్కరించుకుని గూడూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావుతో పాటు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆకులమన్నాడు, కప్పలదొడ్డి గ్రామాల్లోనూ పలువురు నాయకులను పరామర్శించి పెడన చేరుకున్నారు. బంటుమిల్లి రోడ్డులోని స్వీట్‌షాప్ రఫీని పలుకరించిన ఆయన బంటుమిల్లి మీదుగా కృత్తివెన్నులో పెళ్లికి హాజరయ్యారు. బల్లిపర్రు వద్ద కాకర్లమూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు జోగి రమేష్‌కు గజమాలతో స్వాగతం పలికారు. ఆర్టీసీ మాజీ చైర్మన్ పిన్నింటి మహేష్ తదితర నాయకులను పరామర్శించారు. వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో జోగి రమేష్ బంటుమిల్లిలోని పలువురు నాయకులను కలిశారు. తిరిగి పెడన చేరుకున్న ఆయన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బళ్ల గంగయ్య ఇంటికి చేరుకున్నారు. ఇక్కడే పట్టణంలోని పలువురు నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు కలిశారు. ఈ సందర్భంగా జోగి రమేష్ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ఆప్యాయంగా పలుకరించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, కౌన్సిలర్ రహితున్నీసా, శిరివెళ్ల జయేష్, మైనార్టీ నాయకులు అయూబ్‌ఖాన్, పట్టణ నాయకులు బండారు మల్లి, గూడూరు నాయకులు పర్ణం పెదబాబు, బంటుమిల్లి నాయకులు సుజ్ఞానం మహేష్, వన్నంరెడ్డి మహంకాళరావు, జోగి శ్రీనివాసరావు ఉన్నారు.

హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన శివాజీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు



మచిలీపట్నంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెడనలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నగర సంకీర్తనలో భక్తులు

పెడన: హిందూ ధర్మానికి వన్నె తీసుకువచ్చిన మహా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని పలువురు కొనియాడారు. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని స్థానిక గూడూరు రోడ్డులోని రైలుగేటు సమీపంలో వేంచేసి ఉన్న శ్రీరామాలయం గుడివద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకుడు పిచ్చుక శంకర్, నాదెండ్ల కోటేశ్వరరావు, పేరక రాంబాబు, పి.గణపతి, ఎ.అజయ్, పేరక రవి తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలో పలు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని స్థానిక జవ్వారుపేట సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగలింగం అయోధ్య రామచంద్రరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెరువులు బుచ్చిరాజు, బొడ్డు శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు హేమంత్ భవాని శంకర్, అన్నం అవినాష్, మారుతి, శివ, రవితేజ, నాయుడు, దుర్గారావు, వీరమల్లు అభినందన, బోనాల ఈశ్వర్ కృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు రామారావు, మాదిరెడ్డి వెంకట సతీష్ తదితరులు శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నగర సంకీర్తన

పెడన: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం పట్టణంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందూ బంధువుల ఐక్యవేదిక పెడన శాఖ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సెంటరులోని శ్రీఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి నగర సంకీర్తన బయల్దేరి పెద్ద దేవుడి గుడి శ్రీఆగస్తేశ్వరస్వామి ఆలయం వరకు కొనసాగింది. అనంతరం శ్రీరుక్మిణి సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఫల్గుణ దాస స్వామిజీ ప్రవచనం చేశారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. హిందూ బంధు ఐక్యవేదిక నాయకులు పర్యవేక్షణలో ప్రశాంతంగా నగర సంకీర్తన జరిగింది. పెడన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కౌలు కార్డుల జారీలో నిబంధనలు తొలగించాలి

అవనిగడ్డ: కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో యజమాని సంతకం ఉండాలనే నిబంధన తొలగించాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. అవనిగడ్డ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో 70 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని, ఖర్చులు పెరిగిపోవడం గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల కౌలు రైతులు నష్టాల భారిన పడుతున్నారని చెప్పారు. రైతుల తరుపున శాసనమండలిలో అనేక సార్లు తమ వాణిని కేఎస్ లక్ష్మణరావు వినిపించారని త్వరలో జరగనున్న ఎన్నికల్లో లక్ష్మణరావుని గెలిపిస్తే కౌలు రైతులకు న్యాయం జరిగేలా పోరాడతారన్నారు. ఈ సమావేశంలో కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

చల్లపల్లి: వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనటంతో బైకిస్టు మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అవనిగడ్డకు చెందిన షేక్ నాగూర్ బాషా (36) తాపీ పనిచేసుకుంటూ మచిలీపట్నంలో ఉంటున్నాడు. బుధ వారం అవనిగడ్డ వచ్చి సాయంత్రం మచిలీపట్నం తిరిగి వెళుతున్న సమయంలో చల్లపల్లి- మచిలీపట్నం జాతీయ రహదారిపై నూకలవారిపాలెం అడ్డరోడ్డు వద్ద చెన్నై నుంచి విశాఖపట్నం వెళుతున్న లారీ వెనుక నుంచి నాగూర్‌బాషాను ఢీకొట్టింది. దీంతో బాషా కాలు నుజ్జయ్యింది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది హైవే అంబులెన్స్‌లో బాషాను మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే నాగూర్‌బాషా మృతి చెందినట్లు వైద్యులు చెప్పగా కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తునట్లు చల్లపల్లి ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతుడు నాగూర్ బాషాకు భార్యా, కుమార్తె ఉన్నారు.

కుళాయిల్లో మురుగునీరు సరఫరాపై ఫిర్యాదు

మోపిదేవి: స్థానిక గ్రామ పంచాయతీ కుళాయిద్వారా సరఫరా అవుతున్న నీరు దుర్వాసనతో మురుగు వస్తోందని, సంబంధితులకు ఎన్నిసార్లు చెప్పినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన పార్టీ నాయకుడు కోసూరు రామాంజనేయులు మచిలీపట్నం ఆర్డీవో స్వాతి దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం పెదకళ్లేపల్లిలో సమావేశంలో ఉన్న ఆర్డీవోను కలసి మోపిదేవి గ్రామ పంచాయతీ సరఫరా చేస్తున్న మురుగునీటిని బాటిల్‌లో పట్టి చూపించారు. పంచాయతీ అధికారులకు, సోమవారం స్పందన కార్యక్రమంలో ఎంపీడీవోకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ఆర్డీవోకు ఆయన వివరించారు. అదే సమావేశపు హాలులో ఉన్న గ్రామ కార్యదర్శి మల్లేశ్వరావును పిలిచి ఈ మంచినీరు మీరు తాగగలరా అంటూ ఆర్డీవో స్వాతి నిలదీశారు. వెంటనే సమస్యను పరిష్కరించి ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని ఆదేశించారు. అక్కడే ఉన్న ఎంపీడీవో స్వర్ణభారతి కూడా స్పందించి వెంటనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కలెక్టర్ డీకే బాలాజీ



మహిళలను అభినందిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పురుషులతో పాటు సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఆయన చాంబర్‌లో బుధవారం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మచిలీపట్నంకు చెందిన ముగ్గురు మహిళలను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్న ముంతాజ్‌బేగం, రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీ రాష్ట్రపతి భవన్ ఎట్ హోంలో వీణ వాయిద్యంతో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రశంసలు పొందిన అప్పికట్ల దీప్తి, ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో మూడు పతకాలు పొందిన తోట విజయ కుమారిలను కలెక్టర్ డీకే బాలాజీ సత్కరించి అభినందించారు.

శివరాత్రి వేడుకల్లో సమన్వయం లోపిస్తే చర్యలు

మచిలీపట్నం ఆర్డీవో స్వాతి



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మహాశివరాత్రి వేడుకలను అధికారులంతా సమన్వయంతో విజయవంతం చేయాలని మచిలీపట్నం ఆర్డీవో స్వాతి అన్నారు. మండలంలోని పెదకళ్లేపల్లి శ్రీదుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి మార్చి 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెదకళ్లేపల్లిలో పలుశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం రెండోసారి బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో ఉత్తర దిక్కుగా ప్రవహించే కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారి దర్శనార్థం రాష్ట్రం నలుమూలల నుంచి వేలసంఖ్యలో భక్తులు రానున్నట్లు తెలిపారు. మహాశివరాత్రికి బాధ్యతగా పనిచేయని అధికారులపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. పర్వదినం మూడు రోజుల పాటు మద్యం షాపులు మూసివేయాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. పొలంలో మినుము పంట సాగులో ఉన్నందున పార్కింగ్ ప్రదేశం ఇబ్బందిగా ఉందని, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రముఖులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం విషయంలో పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎల్‌పీవో సీతారామయ్యకు ఆర్డీవో సూచించారు. అనంతరం కృష్ణానది వద్ద స్నానఘాట్స్ పరిశీలించారు. స్నానాలకు నదిలో భక్తులు లోనికి పోకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వాటికి ఇనుప మెష్ కూడా ఏర్పాటు చేయాలని ఆర్సీ అధికారులను ఆదేశించారు. బోటులు, గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్లు సిద్ధం చేయాలన్నారు. పితృదేవతలకు సమర్పించుకునే పిండప్రదానాలను విశాలంగా ఉన్న ఒకే ప్రదేశంలో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు స్వామివారు, అమ్మవార్లను ఆర్డీవో, అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ విడివిడిగా దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీడీవో స్వర్ణభారతి, డెప్యూటీ తహసీల్దార్ వాణి, ఎస్‌ఐ సత్యనారాయణ, పలుశాఖల అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో



ఘంటసాల హైస్కూల్లో పోలింగ్ కేంద్రాల వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో స్వాతి

ఘంటసాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం, జెడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ తరగతులు, ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో స్వాతి బుధవారం తనఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పలు విషయాలపై ఆరా తీశారు. ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని, నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో స్వాతి హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాలు, శిక్షణ తరగతుల పరిశీలన

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో స్వాతి పరిశీలించారు. తాగునీరు, విద్యుత్, ఇతర సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులను కూడా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం సక్రమంగా అందించాలన్నారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, డీటీ కనకదుర్గ, ఆర్ఐ కె.శ్రీనివాస్, సర్వేయర్ పి.శ్రీనివాసరావు, పీడీఎస్ డీటీ కె.శ్రీనివాసరావు, ఎంఈవో- 2 ఎండీ మోమిన్, సీనియర్ అసిస్టెంట్ చైతన్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు టి.రమా నాగమణి, డి.మేరీ, హెచ్ఎం శ్రీరంగవల్లి, రెవెన్యూ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సామర్థ్యాలను పెంపొందించుకోండి

మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ రాణి



గూడూరులో అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న పీడీ ఎంఎస్.రాణి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ త్రిపురసుందరీదేవీ



కోడూరులో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

గూడూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని సామర్థ్యభివృద్ధిని పెంపొందించుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎస్.రాణి కోరారు. జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను బుధవారం పీడీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ తరగతుల్లో చెబుతున్న అంశాలపై శ్రద్ధ పెట్టాలని కోరారు. సమగ్రాభివృద్ధిలోని ఐదు అంశాలైన శారీరకాభివృద్ధి, భాషాభివృద్ధి, సామాజిక- భావోద్వేగ అభివృద్ధి, సాంస్కృతిక- సౌందర్యాభివృద్ధి, మేథోఅభివృద్ధి అంశాలపై ప్రత్యేక దృష్టి చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ- 2 పి.సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యు.ఉషశ్రీ, జన్ను రేవతి, రిసోర్స్ పర్సన్లు మహ్మద్ బషీర్, కె.ఎస్.రవికుమార్, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంతో కూడిన విద్య అవసరం

బంటుమిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ప్రాథమిక విద్యపట్ల మక్కువ కలిగే విధంగా తయారు చేయాలని సీడీపీఓ ఎం.సముద్రవేణి, ఎంఈఓ బి.త్రిపురసుందరీదేవీ అన్నారు. మండల పరిధిలోని అర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా విధానం- 2020 కార్యక్రమాల్లో భాగంగా బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, మండల విద్యాశాఖల సమన్వయంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎల్‌కేజీ, యూకేజీలకు సమానంగా పీపీ- 1, పీపీ- 2 తరగతుల ద్వారా చిన్నారుల్లో విద్య పట్ల మక్కువ పెంచడం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.నాగలక్ష్మి, కే సుమిత్ర, పాఠశాల హెచ్ఎం సీహెచ్.రామచంద్రరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కోడూరు: మండలంలోని వి.కొత్తపాలెం జెడ్పీ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 'జ్ఞానజ్యోతి' పేరిట శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలతో రెండవ రోజైన బుధవారం కూడా ఈ శిక్షణను జరిపారు. ఎంఈఓలు రామదాసు, శ్రీనివాసరావులు శిక్షణలో కార్యకర్తలకు పలు సూచనలిచ్చారు. పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇలాంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఎంఈఓలు చెప్పారు. ప్రాథమిక స్థాయిలో భాషాభివృద్ధి కోసం కృత్యాలు ఎలా వినియోగించాలి, ఆధారిత కృత్యాలు ఎలా అర్థం చేసుకోవాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఒక్కో రోజు ఒక్కో అంశంపై రిసోర్స్ పర్సన్లు వివరిస్తున్నారు. రిసోర్స్ పర్సన్లుగా మన్నె ప్రేమ్‌చంద్, వడుగు నాగరాజు వ్యవహరించారు.

ధ్యాన శివుని విగ్రహావిష్కరణ



ఆవిష్కరణ అనంతరం భక్తులకు దర్శనమిచ్చిన ధ్యాన శివుని విగ్రహం

మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ముఖ ద్వారంపై నూతనంగా ఏర్పాటు చేసిన 16 అడుగుల ధ్యాన శివుని విగ్రహావిష్కరణ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి ఈ విగ్రహ ఆవిష్కరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11.15 గంటల సమయంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉదయం 7.45 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచన, పంచగవ్య ప్రాశన, మంటప దేవతార్చన, శ్రీ భ్రమమరాంబా సమేత మల్లేశ్వరస్వామికి పలు ద్రవ్యాలతో రుద్రాభిషేకం, రుద్ర హోమం, మహా పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహావిష్కరణ, అర్చన, నీరాజన మంత్ర పుష్పములు, దంపతులకు మహదాశీర్వాచన, పండిత సత్కారం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ రవికాంత్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ నగరానికి చెందిన భక్తుడు టి.వెంకట సురేష్‌బాబు, సరిత కుమారి దంపతులు విగ్రహ ఏర్పాటు, అన్నసమారాధన కార్యక్రమాలను సొంత ఖర్చులతో నిర్వహించారన్నారు.

ప్రకటన

[illegible]

ఎస్.వి.వి.వి.ఎస్. మల్లేశ్వరరావు, అడ్వకేట్ [illegible] సెల్: 8885811888